*నేడు భారత్, దక్షిణాఫ్రికా చివరి టీ20*

# పట్టేస్తారా.. పంచుకుంటారా..?

## జోరుమీదున్న టీమ్ఇండియా ● పరువు నిలుపుకునేందుకు సఫారీల యత్నం




జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న యువ భారత జట్టు మరో ద్వైపాక్షిక సిరీస్‌పై కన్నేసింది. నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇప్పటికే 2-1 ఆధిక్యంలో ఉన్న టీమ్ఇండియా.. శుక్రవారం జోహన్నెస్‌బర్గ్ వేదికగా ఆతిథ్య జట్టుతో ఆఖరి మ్యాచ్‌లో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను 3-1తో పట్టేయాలని సూర్యకుమార్ సేన భావిస్తుండగా నేటి పోరులో అయినా నెగ్గి సిరీస్‌ను సమం చేయాలని సఫారీలు యత్నిస్తున్న నేపథ్యంలో క్రికెట్ అభిమానులకు నేడు మరో పసందైన టీ20 విందు అందనుంది.

**ఫోకస్ రింకూపై..**

ఈ సిరీస్‌లో సంజూ శాంసన్, తిలక్ వర్మ తలా ఓ సెంచరీలతో ఫామ్‌ను చాటుకున్నారు. గత రెండు డకౌట్ల నుంచి బయటపడకుంటే శాంసన్ స్థానానికి మరోసారి ఎసరు తప్పకపోవచ్చు. కొంతకాలంగా విఫలమవుతున్న అభిషేక్ శర్మ కూడా గత మ్యాచ్‌లో అర్ధశతకం బాదిగాడిన పడ్డాడు. కానీ ఈ సిరీస్‌లో 'నయా 360' సూర్యకుమార్ ఇప్పటిదాకా తన మార్కును చూపలేదు. ఇదే వేదికలో గతేడాది సూర్య.. టీ20లలో తన ఆఖరి శతకాన్ని నమోదుచేశాడు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా రెండో టీ20లో రాణించినప్పటికీ అతడి పాత్రకు న్యాయం చేయడం లేదు. కానీ 'ఫినిషర్'గా గుర్తింపు పొందుతున్న రింకూ సింగ్ గత 3 మ్యాచ్‌లలోనూ విఫలమయ్యాడు. 3 మ్యాచ్‌లలో కలిపి అతడు చేసింది 28 పరుగులే. తొలి రెండు మ్యాచ్‌లలో ఆరో స్థానాన బ్యాటింగ్‌కు వచ్చిన అతడు.. మూడో టీ20లో ఏడో స్థానంలో వచ్చినా మెరవలేకపోయాడు. 2026లో స్వదేశంలో జరిగే టీ20 ప్రపంచకప్ కోసం ఇప్పటికే సన్నాహకాలు మొదలుపెట్టిన టీమ్ఇండియా.. రింకూ స్థానంతో పాటు జట్టు కాంబినేషన్స్ విషయంలో జాగ్రత్తగా అడుగులు వేయాల్సి ఉంది. మూడో టీ20లో అరంగేట్రం చేసిన రమణ్‌దీప్ సింగ్.. బ్యాటింగ్‌లో మెరిసినా అతడి బౌలింగ్ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు శుక్రవారం మ్యాచ్ పర్యాటక జట్టుకు అద్భుత అవకాశం. సెంచూరియన్‌లో ఆడిన జట్టుతోనే భారత్ నాలుగో మ్యాచ్‌లోనూ బరిలోకి దిగే అవకాశముంది.

**పరువు కోసం..**

సొంతగడ్డపై సిరీస్ జరుగుతున్నప్పటికీ సిరీస్‌లో దక్షిణాఫ్రికా అంచనాలను అందుకోలేకపోతోంది. సీనియర్ల వైఫల్యం ఆ జట్టును తీవ్రంగా వేధిస్తోంది. మార్క్‌రమ్, మిల్లర్, హెండ్రిక్స్ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడం లేదు. తొలి రెండు మ్యాచ్‌లలో ఓపెనర్‌గా వచ్చి విఫలమై గత మ్యాచ్‌లో మూడో స్థానంలో వచ్చినా మార్క్‌రమ్ తేలిపోయాడు. క్లాసెన్, జాన్సెన్ గత మ్యాచ్‌లో మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడటం ఆ జట్టుకు కలిసొచ్చేదే. ఓపెనర్ రికెల్టన్ సైతం విఫలమవుతున్నాడు. అద్భుత పోరాటంతో రెండో టీ20ని గెలిపించిన స్టబ్స్‌పై ఆ జట్టు భారీ అంచనాలే పెట్టుకుంది. బౌలర్ల విషయానికొస్తే జాన్సెన్, కొయెట్జీ రాణిస్తున్నప్పటికీ యువ పేసర్లు సిమెలానె, సిపమ్లా, సీనియర్ స్పిన్నర్ కేశవ్ మహారాజ్ సైతం తేలిపోతుండటం సఫారీలను వేధిస్తోంది.

**తుది జట్లు (అంచనా)**

**భారత్:** అభిషేక్, శాంసన్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్, హార్దిక్, రింకూ, అక్షర్, రమణ్‌దీప్, వరుణ్, బిష్ణోయ్, అర్ష్‌దీప్; **దక్షిణాఫ్రికా:** రికెల్టన్, హెండ్రిక్స్, మార్క్‌రమ్ (కెప్టెన్), స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, జాన్సెన్, కొయెట్జీ, సిమెలానె, మహారాజ్, సిపమ్లా

**ప్రత్యేక అనుబంధం**


*నిర్ణయాత్మక నాలుగో టీ20 జరుగుతున్న జోహన్నెస్‌బర్గ్‌తో భారత్‌కు ప్రత్యేక అనుబంధముంది. 2007లో ఐసీసీ నిర్వహించిన మొట్టమొదటి టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో దాయాది పాకిస్థాన్‌ను ఓడించి ధోనీ సేన ట్రోఫీని ముద్దాడింది ఇక్కడే.*



## రంజీలో రికార్డు భాగస్వామ్యం

పోర్వోరిమ్: అరుణాచల్‌ప్రదేశ్‌తో జరిగిన రంజీ ప్లేట్ గ్రూప్‌లో గోవా బ్యాటర్లు కశ్యప్ బాక్లే (300 నాటౌట్), స్నేహల్ కౌత్నకర్ (314 నాటౌట్) టోర్నీ చరిత్రలో రికార్డు భాగస్వామ్యాన్ని నమోదుచేశారు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు అజేయమైన 606 పరుగులు జతచేసి గతంలో స్వప్నిల్-అంకిత్ పేరిట ఉన్న రికార్డు(594)ను అధిగమించారు.

## మెరిసిన షమీ



ఇండోర్ : ఏడాది తర్వాత ప్రొఫెషనల్ క్రికెట్‌కు రీఎంట్రీ ఇచ్చిన భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో నాలుగు వికెట్లతో సత్తాచాటాడు. బెంగాల్ తరపున ఆడుతున్న షమీ.. 19 ఓవర్లు వేసి 54 పరుగులే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన భారత జట్టులో చోటు ఆశిస్తున్న షమీ.. ఇదే పునరావృతం చేస్తే రెండో టెస్టుకైనా జట్టుతో కలిసే చాన్స్‌ఉంది.

## సర్ఫరాజ్‌కు గాయం

పెర్త్: భారత యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ గాయపడ్డాడు. ఆస్ట్రేలియాతో తొలి టెస్టు కోసం సన్నద్ధమవుతున్న సర్ఫరాజ్‌కు గురువారం జరిగిన నెట్ ప్రాక్టీస్‌లో మోచేతికి గాయమైంది. దీంతో నొప్పితో విలవిలలాడిన సర్ఫరాజ్ వెంటనే నెట్స్ నుంచి నిష్క్రమించాడు. అయితే గాయం తీవ్రత ఎక్కువ లేదని తెలిసింది. రెగ్యులర్ కెప్టెన్ రోహిత్‌శర్మ గైర్హాజరీలో ఖాన్ తుది జట్టులో చోటు దక్కించుకునే చాన్స్ ఉంది. కమిన్స్, స్టార్క్, హాజిల్‌వుడ్‌ను ఎలా ఎదుర్కొంటాడో చూడాలి.

## భారత్ 13-0 థాయ్‌లాండ్

### మహిళల ఆసియా కప్‌లో భారీ విజయం



రాజ్‌గిర్ (బీహార్): మహిళల ఆసియా కప్ ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ (ఏసీటీ)లో భారత్ జోరు కొనసాగుతోంది. గురువారం మన అమ్మాయిలు 13-0తో థాయ్‌లాండ్‌ను చిత్తుచిత్తుగా ఓడించి ఈ టోర్నీలో వరుసగా మూడో విజయాన్ని నమోదు చేశారు. భారత్ తరఫున యువ స్ట్రైకర్ దీపికా ఏకంగా 5 గోల్స్ (3, 19, 43, 45, 45వ నిమిషాలు)తో సత్తా చాటగా ప్రీతి దూబె (9, 40వ ని.), లల్రెమ్‌సియామి (12, 56వ ని.), మనీషా చౌహాన్ (55, 58వ ని.) చెరో రెండు గోల్స్ చేశారు. బ్యూటీ డంగ్‌డంగ్ (30వ ని.), నవనీత్ కౌర్ (53వ ని.) తలా ఓ గోల్ చేశారు. ఆట ఆరంభం నుంచే ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించిన భారత్.. శనివారం చైనాతో తలపడనుంది.

## ముగిసిన సింధు పోరాటం



కుమమొటొ: రెండేండ్లుగా బీడబ్ల్యూఎఫ్ టైటిల్ కోసం ఎదురుచూస్తున్న స్టార్ షట్లర్ పీవీ సింధుకు మరోసారి చుక్కెదురైంది. జపాన్ మాస్టర్స్ ప్రిక్వార్టర్స్‌లో ఆమె ఓటమిపాలైంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 20వ ర్యాంకర్ సింధు.. 21-17, 16-21, 17-21తో మిచెల్లె లి(కెనడా) చేతిలో ఓడిపోయింది. గంటా 15 నిమిషాల పాటు హోరాహోరిగా జరిగిన మ్యాచ్‌లో సింధు తొలి గేమ్ నెగ్గినప్పటికీ రెండో గేమ్‌లో లి పుంజుకుంది. ఒకదశలో ఇరువురూ 16-16తో సమంగా నిలిచినప్పటికీ మిచెల్లి ధాటిగా ఆడి గేమ్‌ను సొంతం చేసుకుంది. మూడో గేమ్‌లో కెనడా అమ్మాయి వరుసగా 4 పాయింట్లు సాధించి ఆధిక్యంలో నిలవడమే గాక క్వార్టర్స్ పోరుకు అర్హత సాధించింది. సింధు నిష్క్రమణతో ఈ టోర్నీలో భారత్ పోరాటం కూడా ముగిసింది.

## ఆసీస్‌కు ధనాధన్ విజయం



గబ్బా (బ్రిస్బేన్): ఆస్ట్రేలియా, పాకిస్థాన్ మధ్య ప్రఖ్యాత గబ్బా స్టేడియం వేదికగా జరిగిన తొలి టీ20లో ఆతిథ్య ఆసీస్ సిరీస్‌లో బోణీ కొట్టింది. వర్షం కారణంగా 7 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన కంగారూలు.. 7 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేశారు. గ్లెన్ మ్యాక్స్‌వెల్ (19 బంతుల్లో 43, 5 ఫోర్లు, 3 సిక్సర్లు), స్టొయినిస్ (7 బంతుల్లో 21 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడారు. అనంతరం ఛేదనలో ఆసీస్ పేసర్ల ధాటికి పాక్ బ్యాటర్లు విలవిల్లాడారు. తొలి ఆరుగురు బ్యాటర్లు కనీసం రెండంకెల స్కోరు కూడా చేయకపోవడంతో ఆ జట్టు 7 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 64 పరుగులకే పరిమితమైంది. అబ్బాస్ అఫ్రిది (20 నాటౌట్) టాప్ స్కోరర్. ఎల్లీస్ (3/9), జేవియర్ (3/13), జంపా (2/11) మెరిశారు.

## నిలకడగా ఆడుతున్న ఆంధ్ర

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్‌తో ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియంలో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర నిలకడగా ఆడుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 58 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 168 పరుగులు చేసింది. షేక్ రషీద్ (79 నాటౌట్), కరణ్ షిండే (41 నాటౌట్) క్రీజులో ఉండగా తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు ఇంకా 133 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 244/5తో రెండో రోజు ఆట ఆరంభించిన హైదరాబాద్.. 301 పరుగులకు ఆలౌట్ అయింది. తన్మయ్ (159) మినహా లోయర్డర్ బ్యాటర్లు విఫలమయ్యారు.


## ఆధిక్యంలో కార్ల్‌సన్

కోల్‌కతా: టాటా స్టీల్ చెస్ ర్యాపిడ్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. గురువారం జరిగిన మూడు వేర్వేరు గేముల్లో ఎస్ఎల్ నారాయణన్, వెస్లీ, ఇరిగేసి అర్జున్‌పై విజయాలతో కార్ల్‌సన్ 5 పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. నోదిర్బె అబ్దుసత్రోవ్ (4.5), వెస్లీ (3.5), డానియల్ దబోవ్, ప్రజ్ఞానంద (3), నారాయణన్, విన్సెంట్ కెయ్‌మర్ (2.5), అర్జున్, నిహాల్ సరిన్, విదిత్ గుజరాతీ (2) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నారు. మరోవైపు మహిళల విభాగంలో అలెగ్జాండ్రా గోర్చెంకా (5), నాన దజింగే (4), వంతిక, హారిక, గునైనా (3.5) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నారు.



## టైటాన్స్ జోరుకు బ్రేక్

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్)లో తెలుగు టైటాన్స్ వరుస విజయాల జోరుకు బ్రేక్ పడింది. గురువారం స్థానిక ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 34-40 తేడాతో యూపీ యోధాస్ చేతిలో ఓటమిపాలైంది. లీగ్‌లో వరుసగా నాలుగు విజయాలతో దుమ్మురేపిన టైటాన్స్ అదే దూకుడు కొనసాగించలేకపోయింది. టైటాన్స్ తరపున విజయ్ మాలిక్ 15 పాయింట్లతో ఒంటరి పోరాటం చేయగా, స్టార్ రైడర్ పవన్ సెహ్రావత్ (4) గాయం కారణంగా తొలి 10 నిమిషాల్లోనే ఆటకు దూరమయ్యాడు. ఇది టైటాన్స్ గెలుపు అవకాశాలను ఒక రకంగా దెబ్బతీసింది. మరోవైపు యోధాస్ తరపున భవానీ రాజ్‌పుత్ (12), ఆల్‌రౌండర్ భరత్ (11) సూపర్-10తో సత్తాచాటారు. ఈ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ ఆది నుంచే సత్తాచాటింది. అటు రైడింగ్‌కు తోడు డిఫెన్స్‌లో వరుస పాయింట్లతో యోధాస్‌ను ముప్పుతిప్పలు పెట్టింది. టైటాన్స్ తరపున సెహ్రావత్ తొలి పాయింట్ అందుకున్నాడు. డిఫెండర్ల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో పవన్ మోకాలికి గాయమైంది. దీంతో అతను వెంటనే మైదానాన్ని వీడాడు. కీలకమైన ద్వితీయార్ధంలో యోధాస్ అద్భుతంగా పుంజుకుని వరుస పాయింట్లతో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. మరో మ్యాచ్‌లో యూ ముంబా 35-32తో తమిళ్ తలైవాస్‌పై విజయం సాధించింది.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.